సాక్షి రాజన్న సిరిసిల్ల

బుధవారం। 4। జనవరి। 2023



బద్ది పోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం వేకువజామునుంచే బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు.



వామపక్ష పోరాటాలతోనే..

వామపక్ష పోరాటాలతోనే ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో బద్దం ఎల్లారెడ్డి వర్ధంతి సభను నిర్వహించారు.

10లో▸

గరిష్టం/కనిష్టం
29.0/19.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరిగి పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాజన్న సేవలో మహారాష్ట్ర మంత్రి



వేములవాడ: వేములవాడ రాజన్నను మంగళవారం మహారాష్ట్ర అటవీ శాఖ మంత్రి సుధీర్ మునుగంటివార్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి ఈవో కృష్ణప్రసాద్, తహసీల్దారు రాజు, బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. రాజన్నను దర్శించుకున్న అనంతరం వేదమూర్తుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి ప్రసాదం అందజేసి, కండువా కప్పి సత్కరించారు.

మార్కండేయ గుడికి రూ.10లక్షల విరాళాలు



సిరిసిల్ల: సిరిసిల్లలో నిర్మిస్తున్న మార్కండేయ ఆలయ నిర్మాణానికి సిరిసిల్ల పట్టణ 'సెస్' డైరెక్టర్ దిడ్డి రమాదేవి- శ్రీనివాస్ దంపతులు రూ.5,11,116 విరాళాన్ని మంగళవారం అందించారు. అంతకు ముందు మరో 'సెస్' డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ- అరుణ దంపతులు రూ.5,01,116 విరాళం అందజేశారు. వీరిద్దరిని సిరిసిల్ల పట్టణ పద్మశాలీ సంఘం శాలువా, పూలమాలలతో సత్కరించింది. సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మండల సత్యం, డాక్టర్ గాజుల బాలయ్య, మోర రవి, శ్రీనివాస్, వెంకటేశం, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో పని చేయిస్తే క్రిమినల్ కేసులు



సిరిసిల్ల: పిల్లలతో ఎవరైనా బలవంతంగా పని చేయిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏఎస్పీ చంద్రయ్య అన్నారు. మంగళవారం సిరిసిల్లలో 'ఆపరేషన్ స్మైల్-9'పై సమీక్షించారు. ప్రభుత్వం ఈనెల 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్- 9వ విడత కార్యక్రమాన్ని చేపట్టిందని, అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి బాల కార్మికులు లేని సమాజాన్ని తయారు చేయాలన్నారు. ఎవరైనా పిల్లలను పనిలో పెట్టుకున్నా, బలవంతంగా భిక్షాటన చేయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. 0–18 ఏళ్ల మధ్య వయసు గల పిల్లలు బడిలో చదువుకోవాలని, తప్పిపోయి వచ్చినా, దుకాణాలు, హోటళ్లలో పని చేయించినా గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. బాలకార్మికులు, భిక్షాటన చేసే పిల్లలు కనిపించినా 100కు డయల్ చేసి సమాచారం అందించాలని కోరారు. జిల్లా సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ, విద్యాశాఖ, లేబర్‌శాఖ సంయుక్తంగా ఆపరేషన్ స్మైల్‌ను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సైకాలజిస్ట్ పున్నం చందర్, ఎస్‌ఐలు శ్రీనివాస్, ప్రేమ్‌దీప్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



సిరిసిల్ల: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ మురళీధర్‌రావు అన్నారు. సిరిసిల్లలో మంగళవారం స్వచ్ఛ భారత్ అభియాన్- కాయకల్ప్‌లో భాగంగా వైద్యులు, సిబ్బంది మానవహారాన్ని నిర్వహించి ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మురళీధర్‌రావు మాట్లాడుతూ, పచ్చదనాన్ని పెంచుతూ, పరిసరాల పరిశుభ్రతను కాపాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతమైన సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు పెరుగుతాయని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రదర్శన నిర్వహించామన్నారు. జిల్లా ఆస్పత్రి నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ప్రదర్శన చేశారు. ఆర్‌ఎంవో డాక్టర్ పత్తిపాక రఘు, డాక్టర్ నాగరాజు, ఎంసీహెచ్ ఇన్‌చార్జి డాక్టర్ తిరుపతి, వైద్యశాల డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మల్కపేట'తో మహర్దశ..!

రిజర్వాయర్‌తో తీరనున్న సాగునీటి కొరత

- తుది దశకు చేరుకున్న పనులు
- కొనసాగుతున్న పంపు, మోటార్ల బిగింపు
- మధ్య మానేరు నుంచి మూడు టీఎంసీలు
- మరో రెండు నెలల్లో పంపింగ్ షురూ
- రూ.996.01 కోట్లతో కాళేశ్వరం-9 ప్యాకేజీ పనులు



రిజర్వాయర్‌లో చేరిన వర్షం నీరు



సిరిసిల్ల- మల్కపేట మధ్య సొరంగంలో లైనింగ్



మల్కపేట రిజర్వాయర్ వద్ద పంప్‌హౌజ్

సిరిసిల్ల: జిల్లాలో కొత్తగా మరో రిజర్వాయర్ అందుబాటులోకి వస్తోంది. బీడు భూములకు శాశ్వతంగా సాగు నీరు అందించే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం-9 ప్యాకేజీ పనులు తుది దశకు చేరాయి. కోనరావుపేట మండలం మల్కపేట వద్ద మూడు టీఎంసీల నిల్వ సామర్థ్యంతో చేపట్టిన రిజర్వాయర్ సిద్ధమైంది. మూడు గుట్టల మధ్య, ఆరు కట్టలతో ఒక్క ఊరు కూడా మునిగిపోకుండా కొత్త జలాశయం రూపుదిద్దుకుంది. మరో రెండు నెలల్లో మల్కపేట రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపే దిశగా పనులు సాగుతున్నాయి. జిల్లాలో గుండెకాయ లాంటి కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీ పనుల ప్రగతిపై ప్రత్యేక కథనం.

బహుముఖ ప్రయోజనాలు

జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల పరిధిలోని 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు మల్కపేట రిజర్వాయర్ కేంద్ర బిందువు కానుంది. ఇప్పటికే 25 టీఎంసీల సామర్థ్యంతో మధ్యమానేరు జలాశయం ఉండగా, మధ్యమానేరు బ్యాక్‌వాటర్‌ను సొరంగం ద్వారా మల్కపేటకు గ్రావిటీ ద్వారా చేర్చి, అక్కడి నుంచి ఎత్తిపోతలు, గ్రావిటీ ద్వారా సింగసముద్రం, ఎగువ మానేరు నింపుతారు. ఎగువ మానేరు, మధ్యమానేరు, మల్కపేట రిజర్వాయర్, నిమ్మపల్లి మూలవాగు నిండితే జిల్లా సస్యశ్యామలం అవుతుంది. బహుముఖ ప్రయోజనాలతో కాళేశ్వం-9వ ప్యాకేజీ పనులు చేపట్టారు. అనేక అవాంతరాలను దాటుతూ, ఎట్టకేలకు మల్కపేటకు మధ్యమానేరు నీటిని చేర్చేందుకు రంగం సిద్ధమైంది.

తొమ్మిదేళ్లుగా సాగుతున్న పనులు

- గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరుకు గోదావరి జలాలను మళ్లించే పథకానికి 2013లోనే శంకుస్థాపన చేశారు.
- తొలుత ఆ పనులు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థనే ఇప్పటికీ పనులు చేస్తుంది. అప్పట్లో రూ.663.50 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు.
- 2015లో పెరిగిన రేట్ల ప్రకారం అంచనాలను మరో రూ.110 కోట్లను పెంచి, రూ.773 కోట్లతో ఒప్పందాలు జరిగాయి. 2018లో రెండోసారి ప్రాజెక్టు అంచనాలను రూ.138.32 కోట్లకు పెంచారు.
- 2020 మే నెలలో మరో రూ.84.69 కోట్లు పెంచి మొత్తం రూ.996.01 కోట్లతో పనులు జరుగుతున్నాయి. అంచనాలు మారుతున్నా.. పట్టుదలగా ఎగువ మానేరును గోదావరి జలాలతో నింపేందుకు సిరిసిల్ల ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కేటీఆర్ పట్టుదలగా పనులు చేయిస్తున్నారు.
- ఇటీవల సిరిసిల్ల కలెక్టరేట్‌లో సమీక్ష సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులను మందలిస్తూ.. 'ఎన్నో గడువులు పోయాయి.. ఇగ నేను ఎప్పుడు పూర్తి అవుతుందో అడుగను.. కానీ వేగంగా 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేయాలి' అని స్పష్టం చేశారు.
- ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ వస్తారని చెప్పారు. ఇది పూర్తయితే ఎగువ మానేరుకు గోదావరి జలాలను నేరుగా చేర్చినట్లు అవుతుంది.

ప్రతికూల పరిస్థితుల మధ్య పనులు

సిరిసిల్ల నుంచి మల్కపేట వరకు 12 కిలోమీటర్లు ఉంటుంది. మొత్తం సొరంగం ద్వారానే మధ్యమానేరు బ్యాక్ వాటర్ మల్కపేట రిజర్వాయర్‌కు చేరాలి. సొరంగం పనులు, సొరంగంలో నీరు వెళ్లేందుకు వీలుగా లైనింగ్ పనులు పూర్తయ్యాయి. సొరంగంలోకి వెళ్లే ఆడిట్ ద్వారాల వద్ద పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మొన్నటి వరకు సొరంగంలో నిండా నీరు ఉండడంతో ఆ నీటిని ఎత్తిపోస్తూ పనులు చేయాల్సి వచ్చింది. మల్కపేట వద్ద నిర్మించిన సర్జిపూల్‌లోనూ నిండా నీరు ఉండడంతో వాటిని ఎత్తిపోసి పనులు చేశారు. సొరంగంలో పైకప్పు కూలడం, ప్రమాదాలు జరగడం వంటి ప్రతికూల పరిస్థితుల మధ్య రిజర్వాయర్ పనులు ఇప్పుడు తుది దశకు చేరాయి. మల్కపేట నుంచి నిమ్మపల్లి మూలవాగు, కోనరావుపేటకు, అల్మాస్‌పూర్, వీర్నపల్లి నాలుగు చిన్న లిఫ్ట్‌లను మరో రూ.137 కోట్లతో చేపట్టారు. ఇవి పూర్తయితే జిల్లాలో సాగునీటి సమస్య శాశ్వతంగా తీరుతుంది.

రెండు నెలల్లో రిజర్వాయర్ నింపుతాం



"కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులు తుది దశకు చేరాయి. మోటారు, పంపుల బిగింపు సాగుతుంది. సిరిసిల్ల- మల్కపేట మధ్య సొరంగంలో లైనింగ్ పనులు పూర్తి అయ్యాయి. ఈ ఏడాది 20వేల ఎకరాలకు సాగునీరు అందించాలని భావిస్తున్నాం. రెండు నెలల్లో రిజర్వాయర్‌లో నీరు నింపే లక్ష్యంతో పని చేస్తున్నాం.

– నల్లా వెంకటేశ్వర్లు, ఈఎన్‌సీ, కాళేశ్వరం- 9వ ప్రాజెక్టు

బ్యాంక్ లింకేజీ లక్ష్యం పూర్తి చేయండి



అధికారులతో మాట్లాడుతున్న గౌతంరెడ్డి

బోయినపల్లి(చొప్పదండి): మండలంలో ఎస్‌హెచ్‌జీ మహిళా గ్రూపులకు సంబంధించి బ్యాంకు లింకేజీ నిర్దేశిత రుణ లక్ష్యం సకాలంలో పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీఆర్డీఓ గౌతంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో మహిళా సంఘాలకు రుణాల మంజూరు విషయంలో అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.7.74 కోట్ల మేర రుణాల మంజూరు లింకేజీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. బ్యాంకులు రుణాల లింకేజీ వేగవంతం చేయాలని ఆదేశించారు. రుణాల మంజూరు విషయంలో సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట ఎల్‌డీఎం మల్లికార్జున్, డీపీఎం సుధారాణి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ వర్సెస్ సీపీఐ



ఇరువర్గాలను సముదాయిస్తున్న పోలీసులు

సిరిసిల్లటౌన్: ఆర్టీసీ అధికారుల తీరుపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం బద్దం ఎల్లారెడ్డి వర్ధంతి సభను పురస్కరించుకుని బీవైనగర్ నుంచి సీపీఐ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించడానికి టెంట్లు వేయించారు. అయితే సభ నిర్వహిస్తారని భావించిన ఆర్టీసీ అధికారులు టెంట్లు తీయాలని కార్మిక నాయకులకు తెలిపారు. కాగా ఆ ప్రాంతానికి వచ్చే కార్మికులకు నీడకోసం తాత్కాలికంగా టెంట్లు ఏర్పాటు చేశామని సీపీఐ నాయకులు.. సభ నిర్వహించవద్దంటూ ఆర్టీసీ అధికారులు వాగ్వాదానికి దిగడం చర్చనీయాంశమైంది. పరిస్థితి చేయి దాటకుండా ఎస్సై శీనానాయక్ ఆధ్వర్యంలో పోలీసులు ఇరువర్గాలను సముదాయించారు.

26 బృందాలతో 'కంటి వెలుగు' పరీక్షలు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, అధికారులు

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో 26 బృందాలతో 'కంటి వెలుగు' కార్యక్రమంలో కంటి పరీక్షలను క్షేత్రస్థాయిలో నిర్వహిస్తామని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. హైదరాబాద్ నుంచి మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 255 గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో కంటి వెలుగు రెండో విడత పరీక్షలు నిర్వహించేందుకు 26 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే 26 మంది ఆప్తాల్మిక్ టెక్నీషియన్లను, 26 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను భర్తీ చేశామన్నారు. 19 ఆటో రిఫ్రాక్టివ్ మిషన్లు వచ్చాయని, కంటి అద్దాలు త్వరలో రానున్నట్లు వివరించారు. జిల్లాలో ఈనెల 18 నుంచి రెండో విడత 'కంటి వెలుగు'ను ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో చేపడుతామని వివరించారు. ఏ రోజు ఎక్కడ శిబిరం నిర్వహించే సమాచారాన్ని ముందుగానే తెలియజేస్తామన్నారు. జిల్లాలో 'కంటి వెలుగు' విజయవంతం చేస్తామని వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీపీవో రవీందర్, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థం మాధవి, మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్వేష్, పోగ్రాం ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడి ఔదార్యం



పాప, తల్లితో వైద్యుడు సురేంద్రబాబు

కోనరావుపేట(వేములవాడ): ఓ చిన్నారి వైద్యానికి సాయం అందించి సేవానిరతిని చాటుకున్నాడు వైద్యుడు. రూ.లక్షకు పైగా సొంతంగా ఖర్చు పెట్టి ప్రాణాన్ని కాపాడాడు. కోనరావుపేట మండలం మరిమడ్లకు చెందిన గంట జ్యోతి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో 5 నెలల క్రితం పాపకు జన్మనిచ్చింది. పాపకు మలద్వారం లేదన్న విషయం తెలియని ఆమె పాపకు పాలు పట్టింది. దీంతో పాప కడుపు ఉబ్బిపోయి అపస్మారక స్థితి లోకి వెళ్లింది. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా రెండు ఆపరేషన్లు చేయాలని రూ.2 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని చెప్పారు. రూ.లక్ష అప్పు చేసి తాత్కాలికంగా ఒక ఆపరేషన్ చేశారు. మరో ఆపరేషన్ కోసం తిరుగుతున్న జ్యోతి సిరిసిల్లలోని పిల్లల వైద్యుడు సురేంద్రబాబును కలిసింది. వీరి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న వైద్యుడు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి రెండో ఆపరేషన్ చేయించాడు. ఈసందర్భంగా సురేంద్రబాబుకు బాధిత కుటుంబం, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సావిత్రిబాయి జీవితం ఆదర్శం



పూలే దంపతుల విగ్రహాలు ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ కళ

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్లటౌన్: ప్రపంచంలో మొట్టమొదటి ఉపాధ్యాయురాలిగా సేవలందించిన సావిత్రిబాయిపూలే జీవితం మహిళా లోకానికి ఆదర్శమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం గీతానగర్ ప్రభుత్వ పాఠశాలలో మహాత్మా జ్యోతిబాపూలె- సావిత్రీబాయి పూలె విగ్రహాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఆరోజుల్లో ఆడపిల్లలకు చదువు ఎందుకనే భావన ను ప్రజల మనస్సులోంచి తుడిచిపెట్టేందుకు సావిత్రీబాయి చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆమె స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఆడపిల్లలు, మహిళల చదువుకు పెద్దపీట వేశారన్నారు. పూలే దంపతుల విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరుగగా వక్తలు మాట్లాడారు. డీఈవో రాధాకిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ఇన్‌చార్జి ఎంఈవో దూస రఘుపతి, హెచ్‌ఎం భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జయంతి వేడుకలు

జిల్లా కేంద్రం సిరిసిల్లలో మంగళవారం రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి, జ్యోతిబాపూలే జీవితాలను విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా వక్తలు పేర్కొన్నారు. సీపీఎం ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మూశం రమేష్, కోడం రమణ, సూరం పద్మ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు సబ్సిడీ రుణాలు

- దరఖాస్తులకు 5వరకు గడువు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సబ్సిడీ రుణాలకు మైనార్టీలకు చెందిన అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మైనార్టీ కార్పొరేషన్ నుంచి రూ.1 లక్ష, రూ.2 లక్షల లోన్లు ఇవ్వనున్నారు. రూ.లక్ష లోను తీసుకున్నవారికి 80 శాతం సబ్సిడీ ఉంటుంది. రూ.2 లక్షలు తీసుకున్నవారికి 70 శాతం సబ్సిడీ అందిస్తున్నారు. రూ.లక్ష లోనులో బ్యాగులు, సబ్బుల తయారీ, కరెంటు మోటార్ల రిపేరు, గాజుల దుకాణం, బార్బర్ షాపు, పాన్ షాపు, బైక్, కారు మెకానిక్, డిస్పోజల్ షాపు ఉన్నాయి. రూ.2 లక్షల లోనులో ఎలక్ట్రీషియన్, స్టేషనరీ షాపు, చెప్పుల దుకాణం, సీసీ టీవీ, ఆటోమొబైల్, బేకరీ, ఫొటోగ్రఫీ, లా ఆఫీసర్, మొబైల్ టిఫిన్ సెంటర్, మాంసం దుకాణాలు, కళ్లజోడు షాపు, జిమ్ సెంటర్, టెంట్ హౌజ్, పిండి గిర్నీ, పరుపుల తయారీ యూనిట్లు ఉన్నాయి.

24 యూనిట్లు.. వందల్లో దరఖాస్తులు

జిల్లా మైనారిటీ శాఖ అధికారులు ఇప్పటికే అన్ని మండలాల వారీగా దరఖాస్తులు స్వీకరిస్తుండగా.. దరఖాస్తుల సంఖ్య 1,417 కు చేరింది. ఈనెల 5 చివరి రోజు కావడంతో దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం కనిపిస్తోంది. అయితే ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేసిన యూనిట్లు కేవలం 24 మాత్రమే ఉండడంతో మైనార్టీలు నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం పునరాలోచించి మండలానికి కనీసం 50 చొప్పున యూనిట్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

అర్హులకు లోన్లు అందిస్తాం



మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం అర్హుల నుంచి స్పందన బాగుంది. ఇప్పటికే వందల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 5 వరకు గడువు ఉంది. దరఖాస్తులను జల్లెడ పట్టి అసలైన అర్హులకు లోన్లు అందిస్తాం.

– టి.శ్రీనివాస్‌రావు, డీఎండబ్ల్యూ ఎఫ్‌ఏసీ

నేడు జిల్లా స్థాయి యువజనోత్సవాలు

సిరిసిల్లఅర్బన్: జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్ల పట్టణంలోని మినీ స్టేడియంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీవైఎస్‌వో ఉపేందర్ ప్రకటనలో తెలిపారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని 26వ జాతీయ యువజనోత్సవాల సందర్భంగా జిల్లాస్థాయిలో యువ కళాకారుల ఎంపిక జరుగుతుందన్నారు. జిల్లాలోని యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలకు సమంత..

సిరిసిల్లటౌన్: 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన 'నన్నూ స్కూల్‌కు పంపితే బాగుండు..' అనే శీర్షిక జిల్లా యంత్రాంగాన్ని కదిలించింది. సిరిసిల్ల పెద్దబజార్ ప్రాంతంలో బడీడు వయస్సు గల సమంత తోటిపిల్లలు పాఠశాలకు వెళ్తుంటే దీనంగా చూస్తున్న వైనంపై 'సాక్షి'లో శీర్షిక ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ అనురాగ్ జయంతి నివేదికను కోరగా, జిల్లా విద్య, వైద్యశాఖలు మంగళవారం పట్టణంలో విచారణ చేపట్టాయి. సదరు బాలిక సుందరయ్యనగర్ పాఠశాలలో చదువుతుందని, పెద్దబజారులోని అమ్మమ్మ ఇంటికి వచ్చి స్కూలుకు పోలేదని అధికారులు పేర్కొన్నారు. బాలికకు చదువుపై అవసరం, ఆవశ్యకతపై తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.అనంతరం స్కూల్‌కు పంపించారు.



పాఠశాలకు బయల్దేరుతున్న బాలిక సమంత

సాక్షి ఎఫెక్ట్..

రామవ్వకు అందిన పింఛన్

కోనరావుపేట(వేములవాడ): ఆటో ఉందని ఓ వితంతువు పింఛన్ కట్ చేసిన అధికారులు 'సాక్షి' కథనానికి స్పందించారు. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామానికి చెందిన నూనె రామవ్వ భర్త మూడేళ్ల క్రితం మృతిచెందాడు. ఆమె వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైంది. అయితే రామవ్వకు ఆటో ఉందని పింఛన్ కట్ చేశారు. దీంతో 'ఆటో ఉందని పింఛన్ కట్ చేశారట' అనే శీర్షికతో నవంబర్ 25న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీపీ చంద్రయ్య, ఎంపీడీవో రామకృష్ణ ఈ సంఘటనపై విచారణ చేశారు. నాలుగు నెలల (ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్) పింఛన్ డబ్బులు రామవ్వ ఖాతాలో జమ చేసినట్లు ఎంపీపీ తెలిపారు.

ఆటో ఉందని పింఛన్ కట్ చేశారట

- పాత సామగ్రి సేకరిస్తూ జీవనం
- మల్కపేటలో మహిళ ఇబ్బందులు



పాత సామగ్రి సేకరిస్తున్న రామవ్వ

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

క్లుప్తంగా

కలెక్టర్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ శుభాకాంక్షలు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మాధవి

వేములవాడ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి–రాజు మంగళవారం కలెక్టర్ అనురాగ్ జయంతిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్‌కు కూడా శుభాకాంక్షలు తెలియజేశారు.

జిల్లా సైన్స్ అధికారిగా దేవయ్య



దేవయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లా సైన్స్ అధికారిగా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పాముల దేవయ్యను నియమించారు. జిల్లా విద్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని వేలాది మంది విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచిన దేవయ్యను జిల్లా సైన్స్ అధికారిగా నియమించడంపై ఎల్లారెడ్డిపేట మండల ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఆటోడ్రైవర్‌కు ఆరు నెలల జైలు

జగిత్యాలక్రైం: ఆటోను అజాగ్రత్తగా నడిపి, ఓ వ్యక్తి మృతికి కారణమైన ఆటోడ్రైవర్‌కు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు న్యాయస్థానం జడ్జి జితేందర్ తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి శివారులో 28.06.2017న అదే గ్రామానికి చెందిన మహారాజు రవి బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో మానకొండూరు మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన దుద్దెడ రమేశ్ ఆటోను అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రవి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అప్పట్లో జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడిని ఏపీపీ రాజేశ్, కోర్టు కానిస్టేబుల్ గుండ హరిప్రసాద్ మంగళవారం న్యాయస్థానంలో హాజరుపరిచి, సాక్ష్యులను ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి ఆటోడ్రైవర్‌కు ఆరు నెలల జైలుశిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఒకరి బలవన్మరణం

జ్యోతినగర్(రామగుండం): అనారోగ్య కారణాలతో ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నపూర్ణకాలనీకి చెందిన మెండె ప్రభాకర్(45) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు ప్రకారం.. ప్రభాకర్ పదేళ్లుగా రామగుండం సీఆర్పీగా పని చేస్తున్నాడు. ఇదివరకే అతనికి ఒక కన్ను లేకపోగా, ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆయన మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చక్రపాణి తెలిపారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే క్వార్టర్లలో నివాసముంటున్న ఆ శాఖ ఉద్యోగి తాండ్ర శ్రీనివాస్(38) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సహదేవ్‌సింగ్ తెలిపిన వివరాలు.. వరంగల్ జిల్లా కాజీపేట సమీపంలోని బాపూజీనగర్‌కు చెందిన శ్రీనివాస్ పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. ఆయన ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని, విచారణ జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య రజిత, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

నేలల్లో పేరుకున్న భాస్వరం

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రమాద ఘంటికలు
- కేంద్ర వ్యవసాయ శాఖ పటాల విడుదలతో తేటతెల్లం
- విచ్చలవిడిగా ఎరువుల వినియోగమే కారణం
- అడ్డుకట్టకు చర్యలేవీ?



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

కరీంనగర్ అర్బన్: నేలల్లో భాస్వరం పేరుకుపోయింది. దేశవ్యాప్తంగా 11 జిల్లాల్లో అత్యధిక స్థాయిలో ఉండగా అందులో ఉమ్మడి కరీంనగర్ ఉండటం ఆందోళనకర పరిణామం. తాజాగా కేంద్ర వ్యవసాయ శాఖ పటాల విడుదలలో ఇది తేటతెల్లమైంది.

భూసార పరీక్షల ఫలితాలేవీ?

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఎరువులను విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో నేలల్లో భాస్వరం నిల్వలు పేరుకుపోయినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ తెలిపింది. భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించడంలో లోపం, సేకరించిన మట్టి నమూనాల ఫలితాలను త్వరితగతిన ఇవ్వకపోవడం, ఇచ్చిన చోట వాటికనుగుణంగా సాగు చేసేలా అన్నదాతలను ప్రోత్సహించకపోవడమే దీనికి ప్రధాన కారణాలు. ఫలితంగా సాగు రంగంలో పెట్టుబడులు తీవ్రమవుతుండగా లాభం పొందుతున్నది ఎరువుల కంపెనీలు, ఫర్టిలైజర్ దుకాణాలు. ఎండనకా.. వాననకా కష్టపడితే కర్షకునికి మిగిలేది కన్నీళ్లు.. అప్పులు.

ఒకప్పుడు పేడ పురుగులు చల్లేవారు..

ఒకప్పుడు పంట పొలాల్లో చెత్తాచెదారం, మలమూత్రాలు, కళేబరాలు, ఇతర విసర్జకాలను మట్టిలో కలిపే పేడ పురుగులు తదితరాలను చల్లేవారు. ఇది సహజ ఎరువుగా ఉపయోగపడి, నాణ్యమైన పంట దిగుబడి వచ్చేది. పుప్పొడిని వ్యాపింపజేసే కీటకాలకూ మనుషుల్లాగే ఆహారం, ఆశ్రయం, నీరు, సంతానాన్ని పెంచుకోడానికి ఆరోగ్యకరమైన వాతావరణం అవసరం. ఇందు కోసం మట్టి (నేల) ఆరోగ్యంగా ఉండాలి. అందుకే భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి.

జింక్, సల్ఫర్ లోపం..

ఇప్పటివరకు జరిగిన భూసార పరీక్షల్లో తేలిన ఫలితాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. ఇష్టారీతిగా పురుగు మందుల వాడకంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుండగా, నీరు విషపూరితంగా మారి, ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. జింక్ లోపముంటే వరిలో దోమపోటు, నూనె ఉత్పత్తులు పండ లేదంటే సల్ఫర్ లోపమున్నట్లు లెక్క. ఇవేవీ గమనించకుండానే మూసధోరణిలో పంటలను సాగు చేసి, భూములను గుల్లబారుస్తున్నారు.

16 రకాల పోషకాలుండాలి

నేలలో విత్తనం వేసే ముందు భూసార పరీక్షలు చేయించాలి. దీనివల్ల భూమిలో 16 రకాల పోషకాలు జింకు, బోరాన్, ఐరన్, మాంగనీస్, ఫాస్పరస్, పొటాషియం, నైట్రోజన్, కాల్షియం, కాపర్, సల్ఫర్, మెగ్నీషియం, మాలిబ్డినం, క్లోరిన్, కార్బన్, హైడ్రోజన్, ఆక్సిజన్‌లలో ఏవి ఎంత మేరకు ఉన్నాయో తెలుస్తాయి. వాటిని బట్టి ఎరువులు వాడితే పెట్టుబడి 30 నుంచి 40 శాతం వరకు తగ్గుతుంది. అలాగే సరైన మోతాదులో ఎరువులు వేయడం వల్ల పర్యావరణానికి మేలు జరిగి, నేల నిస్సారమవదు.

పీఎస్‌బీ వినియోగించాలి

భాస్వరం ఎక్కువగా ఉన్న నేలల్లో ఫాస్ఫరస్ సొల్యుబుల్ బ్యాక్టీరియా(పీఎస్‌బీ) అనే జీవన ఎరువును ఎకరానికి రెండు కిలోలు వాడాలి. ఇది భాస్వరాన్ని కరిగించి, మొక్కకు వెళ్లేలా చేస్తుంది. వానాకాలం సీజన్‌లో రైతులందరికీ పీఎస్‌బీ ఇవ్వడంతోపాటు వినియోగించేలా వారికి అవగాహన కల్పించాలని జయశంకర్ వర్సిటీ నిర్ణయించింది. దీనివల్ల డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల కొనుగోలు భారమూ తగ్గుతుంది.

రైతు వేదికల్లో చర్యలేవీ?

రైతుల ప్రయోజనార్థం నిర్మించిన రైతు వేదికల్లో భూసార పరీక్షలు నిర్వహించాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించగా తదనుగుణ చర్యలు కరువయ్యాయి. కావాల్సిన పరికరాలు అందకపోగా గతంలో మినీ ల్యాబ్‌లు పంపిణీ చేశారు. ఉనికిలో ఉన్న వాటిని వేదికలకు అందిస్తే ఫలితాలుంటాయి.

ఎరువుల మోతాదు మించొద్దు



భూసార ఫలితాలను బట్టి ఎరువులను వినియోగించాలే తప్ప పంట రావడం లేదని ఇష్టానుసారంగా వాడొద్దు. మోతాదు మించితే వాటి అవశేషాలు మనుషులు, పక్షులు, జలచరాల్లో కలుస్తాయి. పీఎస్‌బీ వాడకంతో ఉన్న భాస్వరాన్ని మొక్కలకు అందించవచ్చు. పెట్టుబడి భారం 40 శాతం తగ్గుతుంది.

– డాక్టర్ జి.మంజులత, హెడ్ డీన్, సీనియర్ సైంటిస్ట్, వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్

భూసార పరీక్షల తీరిది..

నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో	: ఒక మట్టి నమూనా (10 ఎకరాలకు)
వర్షాధార ప్రాంతాల్లో	: ఒక నమూనా (25 ఎకరాలకు)
మొత్తం మట్టి నమూనా పరీక్షలు	: 82 వేలు
భాస్వరం ఎక్కువగా ఉన్నట్లు తేలిన నమూనాలు	: 50 వేలు

పత్తి రైతు పరేషాన్

- కూలీల కొరత.. చేలలోనే పంట
- తగ్గుతున్న ధరలతో అన్నదాత ఆందోళన



చేనులో ఉన్న పత్తి పంట

వేములవాడరూరల్: పత్తి పంటను నమ్ముకున్న రైతలు ఈ సంవత్సరం ఆశించిన లాభాలు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మొదట్లో ధర మెరుగ్గానే ఉన్నప్పటికీ అది కొద్దిరోజులు మాత్రమే పలికింది. ప్రస్తుతం పంట చేతికి వచ్చే సమయానికి కూలీలు దొరక్క, ధరలు తగ్గడంతో రైతులు పరేషాన్ అవుతున్నారు.

దాదాపు 60 వేల ఎకరాల్లో..

జిల్లాలో చాలా మంది రైతుల పంట ఇప్పటికీ 50 శాతం పైగా చేలలోనే ఉన్నట్లు తెలుస్తోంది. పత్తి ఏరేందుకు కూలీలు దొరక్కపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ సారి జిల్లాలోని 13 మండలాల్లో దాదాపు 60 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. పంట చేతికి వచ్చే సమయానికి వరి నాట్లు ప్రారంభం కావడంతో కూలీల కొరత ఏర్పడింది. పత్తి పంట ఏరేందుకు, వరినాట్లకు రైతులు అదనపు చార్జీలు పెట్టుకుని ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకువస్తున్నారు. వరినార్లు ముదిరిపోతాయని ముందుగా నాట్ల పనుల్లో రైతన్నలు ఉన్నారు. ఇక పత్తి పగిలి చేలలోనే ఉంటోంది. కొంత మంది రైతులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలతోనే పనులు చేయించుకుంటున్నారు. ఈ సమయంలో రూ.250– రూ.300 వరకు కూలీల రేట్లకు డిమాండ్ పెరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. అంత మొత్తంలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా సరిపడా కూలీలు అందుబాటులో లేకపోవడంతో కొంత మంది రైతులు పత్తి పంటను చేలలోనే వదిలిపెడుతున్నారు.

ఒకేసారి పత్తి ఏరివేత, వరి నాట్లు..



పత్తి పంట ఏరుడు, వరినాట్లు ఒకేసారి మొదలయ్యాయి. దీంతో కూలీలు దొరక్క ఇబ్బందులు పడుతున్నం. చాలా మంది రైతులు పత్తి పంటను వదిలివేసి ముందుగా వరినాట్లు వేసుకుంటున్నారు. గ్రామంలో దొరక్కపోతే ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక ఆటోల్లో కూలీలను తీసుకువచ్చి పనులు చేయించుకుంటున్నాం. అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది.

– సార మహేష్, రైతు, జయవరం

కూలి పెంచుదామన్నా దొరకడం లేదు



వరినాట్లు, పత్తి ఏరేందుకు కూలీలు దొరకడం లేదు. వారు కోరిన కూలి ఇద్దామన్న గ్రామాల్లో రావడం లేదు. కొంత మంది ఇతర మండలాల నుంచి అదనపు చార్జీలు పెట్టుకుని పిలిపించుకుంటున్నాం. చాలా మంది రైతుల పత్తి నేటికీ చేలలోనే ఉంది.

– సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతు, హన్మాజిపేట

అక్కను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని..

- స్నేహితుడితో కలిసి యువకుడి అద్దె ఇంటికి నిప్పు పెట్టిన తమ్ముడు
- రూ.2 లక్షల ఆస్తి నష్టం
- ఇద్దరు మైనర్లపై కేసు



మంటల్లో కాలిపోతున్న ఇల్లు

హుజూరాబాద్: తన అక్కను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని ఆగ్రహించిన ఓ బాలుడు క్షణికావేశంలో యువకుడు ఉంటున్న ఇంటిని పెట్రోల్ పోసి, తగులబెట్టాడు. ఈ సంఘటన మంగళవారం హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి ఇందిరానగర్‌లో వరికిల్ల దేవయ్య ఓ పెంకుటింట్లో అద్దెకు ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన కుమారుడు రాజశేఖర్ సమీపంలోని యువతిని ప్రేమించి, సోమవారం పెళ్లి చేసుకొని, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. పోలీసులు వారికి కౌన్సెలింగ్ చేస్తుండగానే ఆ యువతి సోదరుడు తన స్నేహితుడితో కలిసి రాజశేఖర్ ఉంటున్న ఇంటికి పెట్రోల్ పోసి, నిప్పంటించాడు. విషయం తెలిసిన వెంటనే హుజూరాబాద్ పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన వెళ్లి, మంటలు ఆర్పివేశారు. కానీ అప్పటికే ఇల్లు, ఇంట్లోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. రాజశేఖర్ తన పెళ్లి కోసం వాహనాన్ని విక్రయించి, తెచ్చుకున్న రూ.50 వేలు, కొత్త దుస్తులు, ఇంట్లోని సామగ్రి కాలిబూడిదయ్యాయి. ఈ ఘటనలో రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని దేవయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్, ఎస్సై ఆసిఫ్‌లు తెలిపారు.

సికాస సెంట్రల్ మాజీ ఆర్గనైజర్ మృతి



రాజారాం (ఫైల్)

రామగుండం: అబాది రామగుండంకు చెందిన, సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) సెంట్రల్ మాజీ ఆర్గనైజర్ దయా రాజారాం(56) అనారోగ్య కారణాలతో మంగళవారం మృతిచెందారు. అంతర్గాం జెడ్పీటీసీ సభ్యుడు ఆముల నారాయణ ఆయన మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. 1988–98 మధ్య కాలంలో రామగుండం, గోదావరిఖని, మందమర్రి, బెల్లంపల్లి తదితర సింగరేణి బొగ్గు గనుల్లో కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమించిన నేత రాజారాం అని కొనియాడారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వీరిది నిరుపేద కుటుంబం కాగా అద్దె ఇంట్లో ఉంటున్నారు.

పుట్టినరోజునే.. పురుగుల మందు తాగి

- కొలనూర్‌లో యువకుడి ఆత్మహత్య



మహేశ్‌రెడ్డి మృతదేహం

ఓదెల(పెద్దపల్లి): ఇంట్లో కుటుంబసభ్యులు, స్నేహితుల మధ్య సంతోషంగా పుట్టినరోజు జరుపుకున్నాడు.. రాత్రి పురుగుల మందు తాగి తనవు చాలించాడు ఓదెల మండలంలోని కొలనూర్‌కు చెందిన గీట్ల మహేశ్‌రెడ్డి (28). పొత్కపల్లి ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్‌రెడ్డి చిన్నప్పటి నుంచి ఫిట్స్‌తో బాధ పడుతున్నాడు. వ్యవసాయ పనులు చురుగ్గా చేసేవాడు. ఫిట్స్ తగ్గేందుకు పలు ఆసుపత్రులకు వెళ్లి, మందులు వాడాడు. అయినా నయం కాకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో సోమవారం పుట్టిన రోజు సందర్భంగా రోజంతా సంతోషంగా గడిపాడు. రాత్రి పురుగుల మందు తాగి, ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రాఘవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో కౌలురైతు దుర్మరణం

- మృతుడు ఒగ్గుకథ కళాకారుడు కూడా..



సంపత్ మృతదేహం

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని గూడెం గ్రామానికి చెందిన వీరముష్టి సంపత్(40) అనే కౌలురైతు, ఒగ్గుకథ కళాకారుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. సంపత్ ఇందుర్తిలో ఓ రైతుకు చెందిన నాలుగెకరాల భూమిని కౌలుకు తీసుకొని, మొక్కజొన్న పంట వేశాడు. ప్రస్తుతం ఎస్సారెస్పీ కాలువలో నీరు వస్తుండటంతో పంటకు పారించేందుకు కాలువ వద్ద మోటార్‌ను అమర్చాడు. ఈ క్రమంలో మంగళవారం దాన్ని ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతం సంభవించింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై మహేందర్ పేర్కొన్నారు.

శబరిమల వెళ్తూ.. అనంతలోకాలకు

- గుండెపోటుతో అయ్యప్ప దీక్షాపరుడి మృతి
- రామగుండం రైల్వేస్టేషన్‌లో ఘటన



అంజయ్య యాదవ్ మృతదేహం

రామగుండం/సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని శాస్త్రినగర్‌కు చెందిన అయ్యప్ప దీక్షాపరుడు, శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ బండ అంజయ్య యాదవ్(41) గుండెపోటుతో మృతిచెందారు. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య యాదవ్ శబరిమల వెళ్లేందుకు తన తోటి స్వాములతో కలిసి సోమవారం రాత్రి రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. కేరళ ఎక్స్‌ప్రెస్ రైలు ఆలస్యంగా నడుస్తుండటంతో టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద అయ్యప్ప స్వాములతో కలిసి, గద్దెపై నిద్రించాడు. మంగళవారం వేకువజామున రైలు వచ్చే సమయానికి ఆయన లేకపోవడంతో దీక్షాపరులు 108కు సమాచారం అందించారు. రామగుండం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య స్వరూప, ఇద్దరు కుమారులున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి పేర్కొన్నారు. అంజయ్య యాదవ్ మృతి విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆయన ఇంటికి వెళ్లారు. మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

రామగుండంలో కార్పొరేటర్ భర్త..

- నేత్రాలను దానం చేసిన కుటుంబసభ్యులు



కనకయ్య నేత్రాలను ఐ బ్యాంకుకు అందిస్తున్న కుటుంబసభ్యులు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, అప్పటి నుంచి చికిత్స పొందుతున్న జంగపల్లి అలియాస్ గడ్డి కనకయ్య(63) మృతిచెందారు. వివరాల్లోకి వెళితే.. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో సీనియర్ సివిల్ కాంట్రాక్టర్, 38వ కార్పొరేటర్ సరోజన భర్త కనకయ్య తన కుటుంబసభ్యులతో కలిసి గౌతమినగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆయనకు కుమారుడు అవినాష్, కూతుళ్లు గౌతమి, అంజలి, పావని ఉన్నారు. గతేడాది సెప్టెంబర్ 14న మున్సిపల్ కార్యాలయం ఎదుట కనకయ్య తన బైక్‌పై వెళ్తుండగా వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన తలకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా అప్పటినుంచి చికిత్స పొందుతున్నారు. ఆపరేషన్ చేసినప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించి, మంగళవారం మృతిచెందారు. అంతటి బాధలోనూ ఆయన నేత్రాలను దానం చేయడానికి కుటుంబసభ్యులు ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి కేఎస్ వాసు, లయన్స్ క్లబ్ ప్రతినిధి బెజిగోల్ త్రివేది ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ కనకయ్య నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. కనకయ్య మృతదేహానికి నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లు నివాళులర్పించారు.

కెనాల్‌లో గల్లంతైన విద్యార్థి మృతి



కెనాల్‌లో విద్యార్థి మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో గల్లంతైన కండ్లపల్లి ఆయుష్(15) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తీన్‌ఖని ప్రాంతానికి చెందిన ఆయుష్ జగిత్యాలలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి ధరూర్ శివారులోని కెనాల్ వద్ద ఫొటోషూట్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో కాలు జారి కాలువలో పడగా గల్లంతయ్యాడు. పెగడపల్లి మండలంలోని దోమలకుంట వద్ద మంగళవారం అతని మృతదేహం లభ్యమైంది. పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని ఎల్ఎండీ కాలనీ సమీప కాకతీయ కాలువలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని, ఫైర్ సిబ్బంది, జాలర్ల సాయంతో బయటకు తీయించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, అతని వయసు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు. ఐదు అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు, తెల్ల వెంట్రుకలు, ఎరుపు కలర్ షర్టుపై నిలువు నలుపు, తెలుపు గీతలు ఉన్నాయని, నలుపు కలర్ ప్యాంటు వేసుకున్నాడని పేర్కొన్నారు. వివరాలు తెలిసినవారు ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో లేదా 94407 95112 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని కరీంనగర్ జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు చెప్పారు.

బావిలో పడి ఇద్దరికి తీవ్ర గాయాలు

తిమ్మాపూర్(మానకొండూర్): పూడిక తీసేందుకు బావిలో దిగుతుండగా క్రేన్ వైరు తెగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లిలో గ్రామానికి చెందిన ఖమ్మం మల్లయ్య బావిలో కూలీలు పూడిక తీస్తున్నారు. మంగళవారం ఉదయం బావిలోకి దిగుతుండగా క్రేన్ వైరు తెగి, గ్రామానికే చెందిన బీనపెల్లి రాజు, దామ అంజయ్య బావిలో పడ్డారు. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.